క్లుప్తంగా

22 నుంచి దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు



జగదీశ్వరి ఆలయంలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన జగదీశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మంగళవారం శరన్నవరాత్రుల ఉత్సవాల పోస్టర్లను ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ధర్మకర్త మాట్లాడుతూ ఈనెల 22న బాలత్రిపుర సుందరీ, 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మిదేవి, 27న లలితా త్రిపురసుందరి, 28న మహాచండీదేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దిని, 2న రాజరాజేశ్వరిగా దర్శనమివ్వనున్నారని తెలిపారు. ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి చండీహోమం నిర్వహించనున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

కుందుర్పి: ఉపాధిహామీ పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడితే విధుల నుంచి తొలగిస్తామని ఎంపీడీఓ లక్ష్మీశంకర్ హెచ్చరించారు. ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టండి శీర్షికన 'సాక్షి'లో సోమ వారం ప్రచురితమైంది. దీంతో మంగళవారం ఎంపీడీఓ లక్ష్మీశంకర్, ఏపీఓ మురళీధర్ తదితరులు మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో పర్యటించి, పనులు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు.

అపరిశుభ్రత తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రధాన గేటు వద్ద పబ్లిక్ జిమ్ దగ్గర, వెలుగు, ఎంపీడీఓ కార్యాలయం పక్కన, సచివాయం-2కు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోయింది. 'సాక్షి'లో కార్యాలయమా..కంపోస్టుయార్డా.. శీర్షికన గురువారం ప్రచురితమైంది. ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం మంగళవారం తొలగింపజేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రాయదుర్గంటౌన్: నిత్యావసర సరుకులు సులభంగా, పారదర్శకంగా అందించేందుకు క్యూఆర్ కోడ్ఆధారిత నూతన స్మార్ట్ రేషన్ కార్డులను కార్డుదారులకు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక నేసేపేటలోని తారజిన్నా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: కార్డుదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా కార్డుల పంపిణీని అధికారులు ఆయా రేషన్ దుకాణాల్లో చేపట్టారు. కార్డు దారుల వేలిముద్రలు, ఓటీపీ అప్‌డేట్ ద్వారా కార్డు దారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 246 రేషన్ దుకాణాలుండగా, మొత్తం 87,905 కార్డుదారులు ఉన్నట్లు తహసీల్దార్ భాస్కర్ తెలిపారు.

ఘనంగా మారెమ్మ జాతర



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కుందుర్పి: కరిగానిపల్లి గ్రామంలో మంగళవారం మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. 45 రోజుల క్రితం గ్రామంలో నూతన మారెమ్మ ఆలయం నిర్మించారు. ఆచారం ప్రకారం అమ్మవారి జాతర నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కలశ స్థాపన, పాలాభిషేకం, మధ్యాహ్నం అమ్మవారి గ్రామోత్సం, సాయంత్రం గ్రామ శాంతి కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారి విగ్రహం ఊరేగింపు



నాగిరెడ్డిపల్లిలో అమ్మవారి విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: నాగిరెడ్డిపల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ దేవి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయంలో ఆకుపూజ, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, జంతుబలి ఇచ్చారు. గ్రామంలో మారెమ్మ, కొల్లాపురమ్మ, కువ్వాడమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

నేడు గోపులాపురంలో మారెమ్మ జాతర

కణేకల్లు: మండలంలోని గోపులాపురంలో బుధవారం మారెమ్మజాతర (ఊరిదేవర) జరగనుంది. 18 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న ఊరి దేవరను వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. దేవమ్మదేవి, పోలేరమ్మ ఆలయాలకు రంగులు వేసి, సుందరంగా తీర్చిదిద్దారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, నాయకులు ఊరిదేవరకు హాజరవుతారని సర్పంచు, నాయకులు ప్రకాష్‌చౌదరి, కృష్ణారెడ్డి, గోపాల్ తెలిపారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం



సంతే కొండాపురంలో వాటర్ ప్లాంట్ వద్ద నిలిచిన మురుగు



నాగిరెడ్డిపల్లిలో ప్రధాన రహదారిపై పారుతున్న వర్షపునీరు

- గ్రామాల్లో ఎటుచూసినా అపరిశుభ్రతే
- దోమల నియంత్రణకు చర్యలు లేవు

బ్రహ్మసముద్రం: మండలంలోని పలు పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది.ఎటుచూసినా అపరిశుభ్రత నెలకొంది. వర్షం వచ్చిందంటే చాలు..వీధుల్లోనూ, ఇళ్ల ముందు నీరు నిలిచి అపరిశుభ్రత నెలకొంటోంది. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలు 33 గ్రామాలు ఉన్నాయి. పంచాయతీల్లో అరకొరగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. ఏ గ్రామంలోనే సక్రమంగా పారిశుధ్య చర్యలు చేపట్టలేదు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే పలు గ్రామాల్లో మురుగునీరంతా రోడ్లపై చేరింది. కొన్ని గ్రామాల్లో అయితే నెలల తరబడి మురుగు నీరు గుంతల్లో నిలిచి పోయింది. దీంతో దోమలు ఆవాసాల ఏర్పాటు చేసుకుని విజృంభిస్తున్నాయి. ప్రధాన రహదారిపై మురుగ నీరు ప్రవహిస్తున్నా..అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

దోమల నియంత్రణకు చర్యలు లేవు..

గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, మురుగునీటితో దోమల బెడద అధికమైంది. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం కానీ గ్రామాల్లో దోమలు మందు ఫాగింగ్ కూడా చేయించలేదు. ప్రజాసమస్యలు, ప్రజారోగ్యంపై పాలకులకు, గానీ అధికారులకు గానీ ఎలాంటి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు పంచాయతీలపై దృష్టిపెట్టి కనీస చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పల్లెలవైపు కన్నెత్తిచూడని ఆరోగ్య సిబ్బంది..

గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొన్నా.. కనీసం ఆరోగ్య సిబ్బంది మాత్రం ప్రజలవైపు కన్నెత్తి చూడడంలేదు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో వారానికి ఓ సారి , 15 రోజులకు ఒక సారి ప్రజా రోగ్యంపై సర్వే లు చేస్తూ.. ప్రజలుకు అవసరమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకునేవారు. కానీ గ్రామాల్లో దాదాపు నెలలు గడుస్తున్నా కూడా కనీసం ఫీవర్ సర్వే కూడా చేపట్టలేదని అంటున్నారు. ప్రతి వారం ఎంఎల్‌హెచ్‌పీ , ఏఎన్ ఎం లతో పాటు ఆశవర్కర్లు గ్రామంలో పర్యటించి,ఆరోగ్య సమస్యలను తెలుసుకునే వారు గానీ ఆశ వర్కర్లు కూడా ఇటువైపు చూడటం లేదని ప్రజలు అంటున్నారు.

హామీలిచ్చి మోసం చేయడం బాబు నైజం



మాల్యంలో సంక్షేమ పథకాలపై ఆరాతీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కాదలూరులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కణేకల్లు: అధికారం కోసం అలవిగాని హామీలిచ్చి మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాల్యం గ్రామంలో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఆలేరి రాజగోపాల్ రెడ్డి, బ్రహ్మనందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్రేగౌడ్‌లు వివిధ కాలనీల్లో పర్యటించారు. కూటమి సర్కారు పరిపాలనలో సంక్షేమ పథకాలన్నీ వస్తున్నాయా? లేదా? అని నాయకులు అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తామని, ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు తీసుకున్న రుణాలపై వడ్డీ వసూలు చేసి, తమ నడ్డీ విరుస్తున్నారని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వివిధ అనుబంధ సంఘాల నేతలు ఆర్కే బ్రద్రీ, హళ్లి నాగరాజు, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వేమన, పాటిల్ గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు సుధాకర్, శశి, వన్నూరుస్వామి, బోయ బసప్ప, రహమతుల్లా, బాష, అల్లీపీరా, చంద్ర, అజయ్, గిరి, రాము, కృష్ణ, కార్తీక్, ఉసేనీ, శివ పాల్గొన్నారు.

వెన్నుపోటు పొడవడం బాబుకు అలవాటే

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం అలవాటేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు డి.హీరేహాళ్ మండలంలోని కాదలూరు, కొత్త హడిగిలి, పాత హడిగిలి, బాదనహాళ్‌లో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు తొండా వెంకటేశులు, తాలుకా బూత్ కమిటీ అధ్యక్షు డు అంజినరెడ్డి, సీనియర్ నాయకులు మురళీమోహన్ రెడ్డి, గంగిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కురుబ హను మంతరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు చిత్రయ్య, రామలింగ గారి వన్నూరుస్వామి, జయరామ్, సర్పంచ్‌లు కాదలూరు లీలావతి, హనుమాపురం శివరామిరెడ్డి, నాయకులు తిప్పేస్వామి, బసవరాజు, హనుమాపురం గౌడ, దొడగట్ట చిన్న ఆంజనేయ, తిప్పేస్వామి, బందూరు వన్నూరుస్వామి, గంగాధర, చిత్రయ్య, దీప, మారెన్న, బసప్ప, గాదిలింగ, కురుబ వన్నూరు స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోగలింగేశ్వర ఆలయానికి రూ.10 లక్షల మంజూరు



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని డొనేకల్‌లో వెలసిన బోగలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మంజూరు చేయించారు. మంగళవారం కొనకొండ్లలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో తిరుమల శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా మంజూరయిన రూ.5లక్షల చెక్కు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కమిటీ సభ్యులకు అందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని పలు ఆలయాలకు తిరుమల శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్, రాంబాబు, మాజీ సర్పంచులు లింగారెడ్డి, భీమలింగప్ప, మల్లికార్జున, రాజన్న, గోపాల్, గాదిలింగప్పలు పాల్గొన్నారు.

పంటల సాగుపై మెలకువలు



ఎస్.తిమ్మాపురంలో మెలకువలు తెలియజేస్తున్న అధికారులు

విడపనకల్లు/కూడేరు: పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని వ్యవసాయాధికారులు తెలియజేశారు. విడపనకల్లు మండలంలోని ఎస్.తిమ్మాపురం, కూడేరు మండలం కొర్రకోడు, చోళస ముద్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కూడేరు ఏఓ శుభకర్, విడపనకల్ ఏఓ పెన్నయ్య పంటల సాగులో మెలకువలు తెలియజేశారు. మొదట దపా యూరియా వాడాలని, ఆతర్వాత నానో యూరియా వాడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, ఐఈఓ కై లాస్,వీఏఏ అశోక్,లక్ష్మన్న, వీఏఏలు పాల్గొన్నారు.

సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఐసీడీఎస్‌లో అవినీతికి పాల్పడుతున్న సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన కమిటీ సభ్యులు మల్లేశు, రామాంజినేయులు, రమేష్, గంగాధర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఐసీడీఎస్‌లో అవినీతి జరుగుతోందని, పేదలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతోందన్నారు.సీడీపీఓపై చర్యలు తీసుకోకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కష్టాలకు ఎదురీది..కొలువు సాధించి...

- పీడీ, మేనమామల సహకారంతో ఉద్యోగం సాధించిన వినీత



జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో సాధించిన పతకాలు, సర్టిఫికెట్లతో వినీత

వజ్రకరూరు: గడేహోతూరుకు చెందిన కురుబ వినీత స్పోర్ట్స్(ఖోఖో) కోటాలో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. వినీత నాలుగేళ్ల వయసులోనే తండ్రి ఎర్రిస్వామి మరణించాడు. ఆతర్వాత తల్లి నాగమ్మ కూడా అనారోగ్యంతో మరణించింది. దీంతో వినీత మేనమామలు సిద్దప్ప,తీర్థప్ప, తిమ్మప్ప వద్ద ఉంటూ చదువుకుంది. వినీత ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు గడేహోతూరులోనూ, ఆరు నుంచి 10వతరగతి వరకు చిన్నహోతూరులో చదువుకుంది. అనంతరం ఇంటర్మీడియెట్ ఉరవకొండ, టీటీసీ అనంతపురంలోనూ, డిగ్రీ అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో చదువుకుంది. చిన్నతనంలోనే వినీత తల్లిదండ్రులు మరణించినా, ఓ వైపు చదువుతోపాటు మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తూ వస్తోంది. పీడీ ప్రభాకర్ ప్రోత్సాహంతో వినీత 12 సార్లు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. 2015లో కేరళలో జరిగిన 35వ జాతీయ స్థాయి క్రీడలు (ఖోఖో) పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. ఈనెల 19న సీఎం చంద్రబాబు చేతులమీదుగా నియామక పత్రం అందుకోనున్నట్లు వినీత తెలిపింది.

వైద్యశిబిరం నిర్వహణపై సిబ్బందికి శిక్షణ



ఉరవకొండలో శిక్షణ ఇస్తున్న వైద్యులు

ఉరవకొండ రూరల్: వైద్యశిబిరం నిర్వహణపై వైద్యసిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మంగళవారం వచ్చేనెల 2వరకు నిర్వహించే స్వస్థ నారీ-సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రాకెట్ల పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేష్ నాయక్ తెలిపారు. వైద్య శిబిరంలో సేవలపై శిక్షణ ఏర్పాటు చేశారు.సీహెచ్‌వో నాగరంగయ్య, సూపర్‌వైజర్ శేఖర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్‌పై ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ , సీహెచ్ఓ ఈశ్వరయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: గడేకల్లులో రెండో రోజు మంగళవారం కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్తనమూనాలు సేకరించారు.

బ్రహ్మసముద్రం: మండలంలో అక్టోబర్ 2 వతేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

సమన్వయంతోనే గ్రామాల సుస్థిర అభివృద్ధి



శిక్షణ హాజరైన సర్పంచులతో అధికారులు

రాయదుర్గంటౌన్: సమన్వయంతో కృషి చేస్తేనే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపీపీలు, గ్రామ సర్పంచులకు రెండు రోజులపాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ప్రారంభించారు. ఎంపీడీఓ కొండన్న అధ్యక్షతన జరిగిన శిక్షణకు ముఖ్య అతిథులుగా స్పెషల్ ఆఫీసర్, రిసోర్స్ పర్సన్ దివాకర్ (అనంతపురం ఎంపీడీఓ), బాలగంగిరెడ్డి (డీపీఆర్‌సీ అనంతపురం), పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు హాజరయ్యారు.

జీడిపల్లిలో ఆర్డీఓ పర్యటన



జీడిపల్లిలోని కాలనీల్లో ఉబికి వస్తున్న ఊటనీటిని పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

బెళుగుప్ప: జీడిపల్లి గ్రామంలో ఆర్డీఓ వసంతబాబు మంగళవారం పర్యటించారు. కాలనీల్లోని ఇళ్ల గోడల నుంచి, వీధుల గుండా ప్రవహిస్తున్న ఊట నీటిని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాత్రివేళలో ఊటనీటితో విషపురుగులు వస్తున్నాయని, ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి అని స్థానికులు ఆర్డీఓకు తెలిపారు. ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలు చేసి,యూనిట్‌కు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని స్థానికులు ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో వీఆర్ఓ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఊటనీటిని పరిశీలించిన అధికారులు

బెళుగుప్ప అంబేడ్కర్ కాలనీలోని ఇళ్ల మధ్య ఉబికి వస్తున్న ఊట నీటిని తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హర్షవర్ధన మంగళవారం పరిశీలించారు. ఊట నీటి కారణంగా అపరిశుభ్రతతో పాటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల దృష్టికి కాలనీవాసులు తెచ్చారు. కార్యక్రమంలో వీఆర్ఓ శ్రావణి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు మెడల్స్ అందిస్తున్న క్యాంప్ కమాండర్ చైతన్యరెడ్డి

కూడేరు: ఎన్‌సీసీ క్యాడెట్లు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం బ్రాహ్మణపల్లి వద్దనున్న ఎన్‌సీసీ నగర్‌లో జరుగుతున్న సీఏటీసీ-11వ ఎన్‌సీసీ శిక్షణ ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాల్లో క్యాడెట్లు అద్భుతంగా పాటలు పాడి, డ్యాన్స్ వేసి అందరినీ ఆకట్టుకున్నారు. శిక్షణలో ప్రతిభను కనబరిచిన క్యాడెట్లకు కమాండర్ చైతన్య రెడ్డి మెడల్స్ అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు క్యాంపు అడ్జుటెంట్ సుధీర్, అధికారులు అనీల్, గోవింద్, దేవమ్మ, పవన్ కుమార్, ప్రసాద్, అప్పారావు, సుబ్బారెడి, కర్నూల్ , నంద్యాల, అనంతపురం జిల్లాలకు చెందిన 400 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

3వేల పశువులకు గాలికుంటు టీకాలు



తూముకుంటలో గాలికుంటు టీకా వేస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వారం రోజులుగా 3 వేల పశువులకు గాలికుంటు టీకా వేసినట్లు పశువైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం తూముకుంట, అప్పిలేపల్లి పశువులకు వైద్య శిబిరాల ద్వారా మందులు అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అతావుల్లా, రామాంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైరస్‌తో గాలికుంటు వ్యాధి వ్యాప్తి

కూడేరు: పశువులకు సోకే గాలి కుంటు వ్యాధి అంటువ్యాధి అని, వైరస్ ద్వారానే వ్యాప్తి చెందుతుందని చోళసముద్రం పశువైద్యాధికారి తులసీరామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం, కరుట్లపల్లి గ్రామాల్లో పశు వైద్యాధికారులు గాలికుంటు వ్యాధి నివారణకు టీకా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు ఎర్రిస్వామి, బాషా, సుబ్బరాయుడు, రాఘవ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి

రాయదుర్గంటౌన్: చదువు అన్నింటికి మూలమని, విద్యతోనే సామాజాభివృద్ధి సాధ్యమని అర్బన్ సీఐ జయానాయక్, ఎంఈఓ-2 వెంకట రమేష్ అన్నారు. మంగళవారం కెంచానపల్లి గ్రామంలో సీఐ జయానాయక్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చదువు ప్రాధాన్యతపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పిల్లల చదువుపై తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీం ఏఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం

రాయదుర్గంటౌన్: ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులపై అన్ని రాజకీయ పార్టీ నాయకులతో 17న సమావేశం ఉంటుందని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

23న పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలంలో ఈ నెల 23న తలనీలాల సేకరణ, వంట పాత్రలు అద్దె, బియ్యం బేడల విక్రయ హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ తిరుమల్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

19న ద్విచక్ర వాహనాల వేలం

కణేకల్లు: కణేకల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 19న ఉదయం 10 గంటలకు పోలీసుస్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలిచిన వారు రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.

అర్హులందరికీ యూరియా పంపిణీ

కళ్యాణదుర్గం: రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలని తహసీల్దార్ భాస్కర్ సూచించారు. మంగళవారం బోరంపల్లిలో యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. స్టాకు వివరాలు, రైతుల సంఖ్య పై స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో మహబూబ్ బాషా, గ్రామస్తులు శర్మాస్, వెంకటేశులు, రంగారెడ్డి, మల్లయ్య, గోపాల్, గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి

బెళుగుప్ప: ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రాజా, కోటి, జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌తో కలసి మండల జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు లింగమయ్య, గోవిందు, అర్జున్, వెంకటరామిరెడ్డి, మండల నాయకులు యు.శ్రీనివాసులు, శ్యామ్, ఓబుళపతి, వెంకటేశులు, జయరాములు, వి.శ్రీనివాసులు, గోవిందరెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని అక్కమాంబ ఆలయం సమీపంలో ఆటో, కారు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. మంగళవారం కళ్యాణదుర్గం నుంచి బోరంపల్లికి వెళ్తున్న ఆటో.. అక్కమాంబ ఆలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఓబులేసు, కాడన్న, హేమంత్ గాయపడ్డారు. స్థానికులు వారిని సీహెచ్‌సీకి తరలించారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆప్కాస్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీ వేసి తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు, గిరిజన సమైఖ్య జిల్లా కార్యదర్శి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

22న చలో అసెంబ్లీ



చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమ పోస్టర్లు విడుదల చేస్తున్న కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉరవకొండ: ఈనెల 22న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉంటుందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, పెద్దముష్టూరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఛలో అసెంబ్లీ కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్ననాయుడు పాత కౌలు చట్టాన్ని రద్దు చేసి, కొత్త చట్టాన్ని తెస్తామని ప్రకటించి నేటికీ పట్టించుకోలేదన్నారు. 15 నెలలవుతున్నా కొత్త చట్టాన్ని అసెంబ్లీలో పెట్టి ఆమోదం తెలపడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.